జ్వాల తెలుగు న్యూస్


RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY తెలుగు దిన పత్రిక...

PUBLISHED FROM: MEDAK | సంపుటి: 02 | సంచిక: 78 | బుధవారం, 26 నవంబర్, 2025 | epaper.medaktoday.net | పేజీలు: 05 | వెల: 02/-


## మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆదేశాలు జారీ



- వరంగల్ జిల్లాలోని నెక్కొండ మేజర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా మార్చాలని తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ
- మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది.
- నెక్కొండతో పాటు మరో ఐదు గ్రామ పంచాయితీలను (అమీన్‌పేట, గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండ తండా, టీకే తండా) కలిపి కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.
- ఈ ఆదేశాలతో నెక్కొండ ప్రజల అభివృద్ధి ఆకాంక్ష నెరవేరనుంది.

తెలంగాణ రాష్ట్రంలో మరొక కొత్త మున్సిపాలిటీ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. వరంగల్ జిల్లాలోని కీలకమైన నెక్కొండ మేజర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా మార్చాలని తెలంగాణ హైకోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో నెక్కొండ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ముందడుగు పడింది. నెక్కొండ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా గుర్తించాలని కోరుతూ మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.


## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్




- మూడు విడతల్లో పోలింగ్
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- నేటి నుంచి అమల్లోకి ఎన్నికల నియమావళి
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్

## ఢిల్లీలో వాయు కాలుష్యం

- రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం
- ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం
- కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- విద్యుత్ వాహనాలను విస్తృతపరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచన



## గురు తేగ్ బహదూర్ త్యాగం నిరుపమానం



- షహీదీ దివస్‌లో మోదీ
- మొఘలుల హయాంలో తేగ్ బహదూర్ ఎంతో సాహసం చూపించారని, కశ్మీరీ పండిట్లను ఇస్లాంలోకి బలవంతంగా మతమార్పిడి చేస్తుంటే దానిని వ్యతిరేకించి, కశ్మీరీ హిందువులకు అండదండగా నిలిచారని గుర్తుచేశారు.

## "ఆంధ్రా నిర్మాతలు..."

- తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు
- వెయ్యి కోట్లతో సినిమాలు చేసి మూడువేల కోట్లు సంపాదించాలనుకుంటున్నారని విమర్శ
- నిర్మాతల్లో 99 శాతం మంది ఆంధ్రా నుంచే ఉన్నారన్న అనిరుధ్ రెడ్డి
- ప్రజలను దోచుకునేదంతా ఆంధ్రా నిర్మాతలేనని వ్యాఖ్య

2లో



## హడలెత్తించిన క్లోరిన్ గ్యాస్ లీక్



- పలువురికి అస్వస్థత
- క్లోరిన్ గ్యాస్ లీక్ సమాచారంతో అగ్నిమాక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు.
- ఆక్సిజన్ మాస్కులు ధరించి గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీని నిలిపివేయడంతో భారీ ప్రమాదం తప్పింది.

## టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల




- ఫిబ్రవరి 15న భారత్-పాక్ మ్యాచ్
- 2026 టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ
- భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యం
- ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు మెగా టోర్నీ
- గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్ జట్లు
- ఫైనల్ అహ్మదాబాద్‌లో, పాక్ చేరితే కొలంబోకు మార్పు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం అధికారికంగా ప్రకటించింది. భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ మెగా టోర్నమెంట్, 2026 ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభమై మార్చి 8న జరిగే ఫైనల్‌తో ముగియనుంది.

# గురు తేగ్ బహదూర్ త్యాగం నిరుపమానం

కురుక్షేత్ర: సిక్కుల తొమ్మిదో గురువు తేగ్ బహదూర్ కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘన నివాళులర్పించారు. సత్యం, ధర్మం, విశ్వాసాలకు ఆయన ప్రతిరూపమని అభివర్ణించారు. మంగళవారంనాడిక్కడ జరిగిన గురు తేగ్ బహదూర్ 350వ అమరవీరుల వార్షికోత్సవంలో ప్రధాని పాల్గొన్నారు. గురు తేగ్ బహదూర్ స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేశారు. 'సత్యం, ధర్మ పరిరక్షణకు కృష్ణ భగవానుడు నిలిచిన గడ్డ ఇది. గురు తేగ్ బహదూర్ సైతం సత్యం, ధర్మ, మత విశ్వాసాల పరిరక్షణకూ నిలిచారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని గురు తేగ్ బహదూర్ స్మారక తపాలా బిల్ల, నాణెం విడుదల చేస్తున్నందుకు భారత ప్రభుత్వం గర్విస్తోంది. గురు సాంప్రదాయాన్ని ఇదే విధంగా కొనసాగించాలని అభిలషిస్తున్నాం' అని మోదీ అన్నారు. మొఘలుల హయాంలో తేగ్ బహదూర్ ఎంతో సాహసం చూపించారని, కశ్మీరీ హిందువులను ఇస్లాంలోకి బలవంతంగా మతమార్పిడి చేస్తుంటే దానిని వ్యతిరేకించి, వారికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఆయన జీవితం, త్యాగం, క్యారెక్టర్ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఔరంగజేబు పాలనలో కూడా తేగ్ బహదూర్ తన సిద్ధాంతాల విషయంలో ఎలాంటి రాజీ పడలేదని, మత పరిరక్షణకు తన తలను కూడా సమర్పించారని అన్నారు. కాగా, కురుక్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీకృష్ణ భగవానుడు మహాభారత యుద్ధంలో వాడిన పవిత్ర శంఖం పాంచజన్యం గుర్తుగా నిర్మించిన 'పాంచజన్య మెమోరియల్'ను ప్రధాని ప్రారంభించారు. హర్యానా ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనీ కూడా ప్రధాని వెంట పాల్గొన్నారు.

# కోటి ఉద్యోగాలు, కొత్తగా టెక్ హబ్

పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం అనంతరం నితీశ్ కుమార్ మంత్రివర్గం మంగళవారంనాడు తొలిసారి సమావేశమైంది. నితీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటి ఉద్యోగాలు కల్పించాలని, 'ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్'గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని నిర్ణయించారు. సమావేశానంతరం బిహార్ చీఫ్ సెక్రటరీ ప్రత్యయ్ అమిత్ ఆ వివరాలను మీడియాకు తెలిపారు. విస్తృత ఉద్యోగావకాశాల కల్పన, పారిశ్రామిక అభివృద్ధిపై సమావేశంలో కీలకంగా చర్చ జరిగినట్టు ఆయన చెప్పారు. డిఫెన్స్ కారిడార్, సెమీకండక్టర్ తయారీ పార్క్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు, మెగా టెక్ సిటీ, ఫిలిస్ సిటీ ఏర్పాటుతో బీహార్‌ను ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా తయారు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎస్ తెలిపారు. న్యూఏజ్ ఎకానమీ కింద రాబోయే ఐదేళ్లలో గ్లోబల్ వర్క్‌ప్లేస్‌గా బీహార్‌ను అభివృద్ధి చేయనున్నామని, ఈ లక్ష్య సాధనకు డెడికేటెడ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టార్టప్ డొమైన్‌లో రాష్ట్రంలోని ప్రతిభావంతులు, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఒక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. ఏఐ డొమైన్‌లో కూడా బీహార్‌ను లీడింగ్ స్టేట్‌గా తీర్చిదిద్దనున్నామని, ఇందుకు అవసరమైన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మిషన్‌కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సీఎస్ తెలిపారు. సోనేపూర్, సీతామఢీలతో సహా 12 సిటీల్లో గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మూతపడిన 9 చక్కెర మిల్లులను పునరుద్ధరించాలని, 25 కొత్త మిల్లులను ఏర్పాటు చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చీఫ్ సెక్రటరీ వివరించారు.

# చెన్నై మినహా ఇతర నగరాలకు మెట్రోరైలు సర్వీసులు అవసరమా..

చెన్నై: రాజధాని నగరం చెన్నై మినహా రాష్ట్రంలోని ఇతర నగరాలకు మెట్రోరైలు అవసరమా? అని రాష్ట్ర ప్రభుత్వం బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, తనకు సంబంధించినంతవరకూ ఇతర నగరాలలో మెట్రోరైలు సర్వీసులు అనవసరమేనని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అన్నారు. శివగంగ వద్ద సోమవారం జరిగిన ఓ వివాహ వేడుకలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ బిహార్‌లో నితీష్ కుమార్ ఎంతకాలం ఆ రాష్ట్రానికి సీఎంగా ఉంటారో చెప్పలేమని, కేంద్రంలోని బీజేపీ చేతుల్లోనే ఆ సీఎం భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పారు. ఇండోర్, ఆగ్రా నగరాల్లోని మెట్రోరైలు సేవలు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయని, అలాంటి పరిస్థితులు తమిళనాట రాకూడదని, కనుకనే తాను చెన్నై మినహా ఇతర నగరాలలో మెట్రోరైలు సర్వీసులు అనవసరమేనని కార్తీ చిదంబరం వివరణ ఇచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ రాబోయే ఐదు నెల వరకు కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి వంటకాలే ఆరగించనున్నారని, తమిళ భాష, తమిళ సంస్కృతి గురించి ప్రతి సభలోనూ ఎలుగెత్తి చాటుతారని కార్తీ చిదంబరం యెద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ఆరుమాసాలే ఉండటంతో మోదీ ఐదు నెలల దాకా దక్షిణభారత ప్రజల సంస్కృతిని గుర్తుకు తెచ్చే దుస్తులనే ధరిస్తారని, తమిళనాడుకు వస్తే ధోవతి,



అంగవస్త్రం ధరించి తమిళులపై ప్రేమాభిమానాలను చాటుకుంటారని ఛలోక్తి విసిరారు.

# భారతి ఆరాధకులు కానరారే

'నేను ఎవరి కోసం తీయని రాగాల్ని పాడాలి?.. మన కనుల ముందే దేశం ఆకలితో కుమిలిపోతున్నప్పుడు. దేశమంతా విషాన్ని మథిస్తుంటే, ఢిల్లీ మద్యం సేవిస్తోంది. దేశమంతా చీకటి నిండితే ఢిల్లీ మెరిసిపోతోంది..' అని హిందీ కవి రాంధారీ సింగ్ దినకర్ (1908%-%74) ఆక్రోశించారు. ఆయన బిహారీ. కాంగ్రెస్‌వాది. జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా దినకర్‌ను మూడుసార్లు రాజ్యసభకు ఎంపిక చేశారు. రాజ్యసభ సభ్యుడుగా ఉన్నప్పుడే ఆయన ఈ కవిత రాశారు. దినకర్ కవితలు ప్రజల వెతలను ప్రభావవంతంగా వ్యక్తం చేశాయి. కనుకనే వాటిని జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే కాదు, అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ సైతం అమితంగా అభిమానించారు. ఈ బిహారీ కవి కవితల్ని వాజపేయి అనేక సందర్భాల్లో ఉటంకించేవారు. మోదీ సైతం తరచూ ఉటంకిస్తూ దినకర్ పట్ల తన అభిమానాన్ని చాటుతుంటారు. కాంగ్రెస్‌వాది అయిన ఈ కవి తల్లజుని శతజయంత్యుత్సవాలను భారతీయ జనతా పార్టీ ఘనంగా నిర్వహించింది. అధికార పీఠాలు గుర్తించినా, గుర్తించకపోయినా కవులు, రచయితలు తమ మనసు కలచివేసిన వాస్తవాల గురించి రచిస్తూనే ఉంటారు. చాలామంది జర్నలిస్టులు రాయలేని నిజాలు కవులు, రచయితల రచనల్లో తచ్చాడుతుంటాయని అంగీకరించక తప్పదు. బిహార్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంతో పోలిస్తే నేరచరితులు 68 నుంచి 53 శాతానికి తగ్గిపోవడం ఒక శుభపరిణామం. గతంలో బిహార్‌లో సాహితీవేత్తలు, రచయితలు, కవులు క్రియాశీలంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేవారు. తర్వాతి కాలంలో వారి స్థానంలో నేర చరితులు ప్రవేశించారు. రామకృష్ణ బేణిపురి, లక్ష్మీనారాయణ సుధాంశు, ఫణీశ్వర్‌నాథ్ రేణు వంటి రచయితలు 1950వ దశకంలో ఎన్నికల బరిలో నిలిచి పోరాడారు. బేణిపురి, సుధాంశు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుపాలయ్యారు. ఆ స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు కూడా. దళితుల హక్కుల పరిరక్షణ, రైతుల ప్రయోజనాల కోసం పోరాడిన ఫణీశ్వర్‌నాథ్ రేణు (1921-77) అరారియా జిల్లాలోని ఫోర్బ్స్ గంజ్ నియోజకవర్గం నుంచి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కబీర్ గీతాల్ని, రామాయణ శ్లోకాల్ని, అమీర్ ఖుస్రో పర్షియన్ కవితల్ని ఉటంకిస్తూ ఆయన ప్రచారం చేశారు. ఎందరో రచయితలు, కళాకారులు ప్రచారం చేసినా ఆయన కేవలం 5వేల ఓట్లు మాత్రమే తెచ్చుకున్నారు. 'తీస్రీ కసమ్' లాంటి కళాత్మక సినిమాలకు ప్రేరణనిచ్చిన రేణు ఎన్నికల ఓటమి తర్వాత 'కాగజ్ కీ నావ్' (కాగితపు పడవ) అనే నవల రచించారు. అప్పటికి దేశంలో ఎన్నికల వాతావరణం సంపన్నులకు, నేర చరితులకు అనుకూలంగా మారిపోయింది. ఆ తర్వాతి కాలంలో దేశంలో రచయితలు, కళాకారులకూ%-% రాజకీయ వ్యవస్థకూ దూరం రోజురోజుకూ పెరిగిపోయింది. రేణు సృజించిన సాహిత్యంలోని స్ఫూర్తిదాయక మాటలను మోదీ, నితీశ్‌కుమార్ మొదలైన నేతలు తరచూ ఉటంకిస్తూ ఉంటారు. బిహార్‌లోని మధుబని ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల గాయని మైథిలీ థాకూర్%-% మైథిలీ, భోజ్‌పురి, హిందీ భాషల్లో స్వంత గీతాలతో పాటు భక్తి గీతాలూ ఆలపిస్తుంటారు. గాయనిగా సామాజిక మాధ్యమాలలో ఆమె బహుళ ప్రచారం పొందారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో అలీనగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆమె విజయం.. ఉక్కబోస్తున్న వాతావరణంలో ఒక మలయానిలం వీయడం లాంటిదే. మైథిలిని తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టడం ఆ పార్టీ ఆలోచనా విధానానికి యుక్తమైన నిర్ణయమే. అయితే దేశంలో తమ పార్టీ భావజాలంతో సంబంధం లేకపోయినా ప్రముఖ రచయితలను, కళాకారులను చట్టసభలకు, ముఖ్యంగా పార్లమెంటు ఎగువసభ అయిన రాజ్యసభకు ఎంపిక చేయడమనే ఒక మంచి సంప్రదాయాన్ని జాతీయ స్థాయిలో కొనసాగించిన నేతలు ఉన్నారు. నెహ్రూ నుంచి వాజపేయి దాకా ఈ సంప్రదాయాన్ని పాటించారు. నెహ్రూ తరచూ రచయితలను తీన్‌మూర్తి భవన్‌కు పిలిచి మాట్లాడడమే కాక గేటు వరకూ వచ్చి వారికి వీడ్కోలు చెప్పేవారు. మైథిలీ శరణ్ గుప్తా, కెఎం.పణిక్కర్, తారాశంకర్ బందోపాధ్యాయ, హరివంశరాయ్ బచ్చన్, జి.శంకర్ కురూప్, ఉమాశంకర్ జోషి, అబూ అబ్రహం, హబీబ్ తన్వర్, భగవతి చరణ్ వర్మ, కుష్వంత్ సింగ్, అమృతా ప్రీతమ్, ఆర్‌కె.నారాయణ్, కర్తార్‌సింగ్ దుగ్గల్, సి.నారాయణరెడ్డి, విద్యానివాస్ మిశ్రా, జావేద్ అఖ్తర్ తదితరులు రాజ్యసభకు నామినేట్ అయిన వారే. సినారెను రాజ్యసభకు నామినేట్ చేసిన సాహిత్య సహృదయుడు వాజపేయి. సినారెను చూడగానే వాజపేయి కవిత్వ పిపాసి అయిపోయేవారు. ఇరువురూ పార్లమెంటు నడవాల్లో ఉర్దూ కవితలను గుర్తు చేసుకుంటూ నడిచేవారు. తర్వాతి కాలంలో పెద్దల సభకు కవులు, రచయితలను ఎంపికచేయడం క్రమంగా తగ్గిపోయింది. ఒకవేళ ఒకరిద్దరిని ఎంపికచేసినా నాటి ప్రమాణాలు వారిలో కనపడడం తక్కువే. ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు? నిజానికి యూరోపియన్ ప్రమాణాలతో పోలిస్తే మన దేశంలో రచయితలను, కళాకారులను గౌరవించిన సందర్భాలు చాలా తక్కువే. ఇటీవల ఐర్లాండ్‌ను సందర్శించినప్పుడు అక్కడ రహదారుల కూడళ్లలోనూ, మార్కెట్ ప్రాంతాల్లోనూ, పార్కుల్లోనూ ఎక్కడ చూసినా రచయితల, కళాకారుల విగ్రహాలే కనపడ్డాయి. డబ్లిన్ నడిబొడ్డున మ్యూజియమ్ ఆఫ్ లిటరేచర్‌లో ఐరిష్ రచయితలు, వారి రచనలను ప్రదర్శించిన తీరు ఎవరికైనా అచ్చెరువు కలిగిస్తుంది. విఖ్యాత నవలా రచయిత జేమ్స్ జాయిస్ (1882%-%1941) రచనలు మనను చుట్టుముడతాయి. మహాకవి విలియం బట్లర్ యేట్స్ (1865%-%1939) పేరిట నిర్మించిన మ్యూజియంలో ఆయనకు సంబంధించిన వస్తువులు, రచనలు, పుస్తకాలను ప్రదర్శించడమే కాక, అడుగడుగునా ఆయన కవితల మధ్య మనం నడుస్తున్నట్లు వాతావరణాన్ని, దృశ్యాల్ని కల్పించారు. గాల్వేలో ప్రముఖ రచయిత ఆస్కార్ వైల్డ్ (1854%-%1900) ఆయన సోదరుడు, కవి విలియమ్ వైల్డ్ విగ్రహాలు కూర్చుని సంభాషిస్తున్నట్లుంటాయి. యేట్స్‌తో పాటు ఎందరో కవులు, రచయితలు ఐరిష్ పార్లమెంట్‌లో సభ్యులు అయ్యారు. ఐర్లాండ్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో కీలకపాత్ర పోషించిన రచయిత డగ్లస్ హైడ్ ఐర్లాండ్ తొలి అధ్యక్షుడయ్యారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి అనీబిసెంట్ లాంటి నేతలను అందించడమే కాదు, మాలపల్లి రచించిన ఉన్నవ లక్ష్మీనారాయణ, రాష్ట్రపతి వీవీ గిరి లాంటి వారికి ఎంతో ప్రేరణ కలిగించిన దేశం ఐర్లండ్. అంతే కాదు, బ్రిటిష్ వారి పాలనలో మనుగడ కోల్పోయిన ఐరిష్ భాషను మళ్లీ పునరుజ్జీవింప చేసిన ఐర్లండ్, భాషా సంస్కృతుల పరిరక్షణ విషయంలో మనకు ప్రేరణగా నిలుస్తుందని డబ్లిన్‌లో మన రాయబారి అఖిలేశ్ మిశ్రా చెప్పారు. నదులు, సంస్కృతులను కాపాడుకునే విషయంలో మనం యూరప్ నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. మన దేశంలో ఎల్లెడలా రాజకీయ నాయకుల విగ్రహాలే కనిపిస్తాయి.

మన ప్రసిద్ధ రచయితలు, కవుల స్మృతులను మనం భద్రపరచగలిగామా? కనీసం ప్రేమ్‌చంద్, గురజాడ, నిరాలా వంటి కవులు, రచయితల ప్రాధాన్యం గురించి ఈ తరం వారికి చెప్పగలుగుతున్నామా? కాళిదాసు కాలం నుంచీ సుసంపన్నమైన మన సాహిత్య కళాసంస్కృతి యూరోపియన్ సాహిత్య, కళాసంస్కృతి కంటే ఎంతో ప్రాచీనమైనదని వారికెలా తెలుస్తుంది? ఇటీవల ఢిల్లీలోని ఏపీ భవన్‌లో 'గుర్జాల హాలు'లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మంత్రి ఆహ్వానం పంపారు. అది 'గుర్జాల హాలు' కాదని, 'దేశమును ప్రేమించుమన్నా' అన్న గీతాన్ని రచించిన ప్రముఖ కవి గురజాడ అప్పారావు పేరును ఆ హాలుకు నందమూరి తారకరామారావు పెట్టారని ఎవరు చెప్పాలి?

# హడలెత్తించిన క్లోరిన్ గ్యాస్ లీక్

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని వాసై వెస్ట్ ప్రాంతంలో మంగళవారంనాడు క్లోరిన్ గ్యాస్ లీక్ కావడంతో జనం భయాందోళనలకు గురయ్యారు. సుమారు 10 నుంచి 12 మంది అస్వస్థతకు గురికావడంతో వారిని హుటాహుటిన సమీప ఆసుపత్రులకు తరలించారు. బాధితులు శ్వాస సమస్యలు, కళ్లు మంటలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్లోరిన్ గ్యాస్ లీక్ సమాచారంతో అగ్నిమాక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. వారు ఆక్సిజన్ మాస్కులు ధరించి గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీని నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. పరిస్థితి అదుపులోనే ఉందని, ఇంకెలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. ఆ ప్రాంత వాసులు ముందస్తు జాగ్రత్తగా కొద్దిసేపు ఘటనాస్థలికి దూరంగా ఉండాలని కోరారు. కాగా, గత శనివారంనాడు ముంబైలోని అంధేరి ప్రాంతంలో కెమికల్ లీక్ కావడంతో 20 ఏళ్ల యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరి తీవ్ర అస్వస్థతతో హెూలీ స్పిరిట్ ఆసుపత్రి ఐసీయూలో చేరారు. బాంగర్‌వాడీ ఏరియాలోని మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ రెండతస్తుల భవనంలో ఈ ప్రమాదం జరిగింది.

# మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆదేశాలు జారీ

నెక్కొండ విస్తీర్ణం, జనాభా దృష్ట్యా దీనిని మున్సిపాలిటీగా మార్చాల్సిన అవసరం ఉందని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి రానున్న నేపథ్యంలో కీలక ఆదేశాలు ఇచ్చింది. మున్సిపాలిటీ ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే వెంటనే జారీ చేయాలని హైకోర్టు.. ప్రభుత్వాన్ని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖను స్పష్టం చేసింది. ఈ తాజా ఆదేశాలు నెక్కొండ ప్రాంతంలో పరిపాలనా సంస్కరణలకు, అభివృద్ధికి త్వరలోనే బాటలు వేసే అవకాశం ఉంది. నెక్కొండను మున్సిపాలిటీగా మార్చే ప్రక్రియలో ఆరు గ్రామ పంచాయితీలను కలపాలని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. నెక్కొండతో పాటు అమీన్‌పేట, గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండ తండా, టీకే తండా గ్రామ పంచాయితీలను కలిపి కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరారు. పిటిషనర్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం.. ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా గుర్తించడానికి సానుకూలత వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగా ఒక ప్రాంతం మున్సిపాలిటీగా మారాలంటే.. దానికి తగినంత జనాభా, ఆదాయ వనరులు, చుట్టుపక్కల ప్రాంతాలతో అనుసంధానం ఉండాలి. నెక్కొండ ఈ అర్హతలను కలిగి ఉండటంతోనే హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీగా మారడం వలన ఈ ప్రాంతాలకు పట్టణ స్థాయి మౌలిక వసతులు, అదనపు నిధులు, మెరుగైన పారిశుధ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. హైకోర్టు ఆదేశాలతో నెక్కొండ ప్రజల ఆకాంక్షలు నెరవేరడం స్థానికంగా రాజకీయంగా ఒక విజయం. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే ఈ ప్రక్రియను ఎంత వేగంగా పూర్తి చేస్తాయనేది ప్రస్తుతం కీలకంగా మారింది. ఈ చర్య, రాబోయే స్థానిక రాజకీయాలలో ఒక కీలక పరిణామంగా మారనుంది. మున్సిపాలిటీగా మారాక ఈ ప్రాంతం ముఖచిత్రం పూర్తిగా మారే అవకాశం ఉంది.

# తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సాయంత్రం మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని ఆమె అన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను సెప్టెంబర్ 29న ప్రకటించామని, కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే వచ్చిందని ఆమె గుర్తు చేశారు. తొలి దశలో 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు... రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు, 38,350 వార్డులకు... మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలకు, 36,452 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.66 కోట్ల మంది గ్రామ ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లను నవంబర్ 27 నుంచి స్వీకరిస్తారు. రెండో విడత ఎన్నికలకు నవంబర్ 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు.

# ఢిల్లీలో వాయు కాలుష్యం

దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకరంగా పడిపోతున్న నేపథ్యంలో పీఎంవో రంగంలోకి దిగింది. కాలుష్యానికి కారకమయ్యే వాహనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాలుష్య నివారణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని విస్తృతం చేసేందుకు చర్యలు ముమ్మరం చేయాలని సూచించింది. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఢిల్లీలోని వాయు నాణ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో వాహనాల కాలుష్యం ప్రధానాంశంగా ప్రస్తావనకు వచ్చింది. దేశ రాజధానిలో ఇంకా 37 శాతం మేర పాత వాహనాలు వినియోగంలో ఉన్నట్లు సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వాటి స్థానంలో ఈవీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఈవీ వాహనాలకు రాయితీలు ఇవ్వడంతో పాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. కాలుష్య కారక పెట్రోల్, డీజిల్ వాహనాలు వినియోగాన్ని తగ్గించాలని అన్నారు.

# టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

ఇటీవలే 2024లో ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు, డిఫెండింగ్ ఛాంపియన్ హెూదాలో ఈ టోర్నీలో అడుగుపెట్టనుంది. ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొననుండగా, చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్ జట్లను ఒకే గ్రూప్‌లో చేర్చడం అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.,కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఐసీసీ ఛైర్మన్ జయ్ షా, 2024 టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ రోహిత్ శర్మ, 2025 మహిళల ప్రపంచకప్ గెలిచిన భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ షెడ్యూల్‌ను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ క్రికెట్‌కు మరింత ఆదరణ తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే 20 జట్లను 5 జట్ల చొప్పున మొత్తం 4 గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 'సూపర్ ఎయిట్' దశకు అర్హత సాధిస్తాయి. సూపర్ ఎయిట్‌లో కూడా జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఈ దశలో ప్రతి గ్రూప్‌లోనూ టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. ప్రకటించిన వివరాల ప్రకారం... గ్రూప్ 'ఏ'లో భారత్, పాకిస్థాన్, యూఎస్‌ఏ, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. గ్రూప్-బి లో మాజీ ఛాంపియన్లు ఆస్ట్రేలియా, శ్రీలంక ఉన్నాయి. వీటితో పాటు జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్ జట్లు కూడా ఇదే గ్రూపులో తలపడనున్నాయి. బలమైన జట్లు ఉండటంతో ఈ గ్రూపు నుంచి తదుపరి దశకు చేరే జట్లపై ఉత్కంఠ నెలకొంది. గ్రూప్ 'సి'లో ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్‌తో పాటు చరిత్రలో తొలిసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించిన ఇటలీ జట్టు కూడా ఉంది. మిగిలిన గ్రూపుల వివరాలను ఐసీసీ త్వరలో ప్రకటించనుంది. గ్రూప్-డిలో బలమైన జట్లయిన దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఉన్నాయి. ఇటీవలి కాలంలో అద్భుతంగా రాణిస్తున్న ఆఫ్ఘనిస్తాన్ కూడా ఇదే గ్రూపులో ఉండటం గమనార్హం. వీటితో పాటు కెనడా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్లు కూడా గ్రూప్-డిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి.

### "ఆంధ్రా నిర్మాతలు..." అంటూ తెలంగాణ

# కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

వేయి కోట్ల రూపాయలు పెట్టుబడితో సినిమాలు నిర్మించి మూడు వేల కోట్లు సంపాదించాలని కొందరు ఆశిస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. సినిమా నిర్మాతలల్లో 99 శాతం మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారేనని, అలాంటి వారు తెలంగాణలో ఉండి అధిక సంపాదన కోసం ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ వాసులు ఇలాంటి పనులు చేయరని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలను దోచుకునే వారంతా ఆంధ్రప్రదేశ్ నిర్మాతలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తన వద్దకు వచ్చి చెబుతున్న విషయాలనే తాను చెబుతున్నానని అనిరుధ్ రెడ్డి అన్నారు. సినిమా అనేది ఒక వ్యాపారమని ఆయన పేర్కొన్నారు. టిక్కెట్ ధరలు పెంచితే సినీ కార్మికులకు కూడా 20 శాతం వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పిన విషయాన్ని తాను సమర్థిస్తున్నానని ఆయన అన్నారు. ఒక కమిషనర్ తన పక్కన సినిమా వాళ్లను పెట్టుకుని మీడియా సమావేశం నిర్వహించడం ప్రతికూల ప్రచారానికి దారి తీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమాలు నష్టాలు మిగిల్చి రోడ్డున పడ్డ నిర్మాతలు కూడా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఏ పని చేసినా, దానిని ప్రభుత్వానికే ఆపాదిస్తారని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. అధికారులు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఐ-బొమ్మ రవి వ్యవహారాన్ని న్యాయస్థానాలు చూసుకుంటాయని అనిరుధ్ రెడ్డి తెలిపారు. దొంగతనం చేయడాన్ని ఎవరూ సమర్థించరని, అది తప్పేనని, కానీ ఎవరి వద్ద దొంగతనం చేశారనేది కూడా ఆలోచించాలని ఆయన ఆసక్తికర వ్యాఖ్య చేశారు. రాబిన్ హుడ్ పెద్ద వారి వద్ద దోచుకుని పేదలకు పంచి పెట్టాడని ఆయన గుర్తుచేశారు. ఐ-బొమ్మ రవిని ప్రజలు రాబిన్ హుడ్ అంటున్నారని, తాను కూడా అదే అంటున్నానని ఆయన పేర్కొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం



**చేగుంట నవంబర్ 25 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చొరవతో వచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఆదేశాల మేరకు, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్, ఆధ్వర్యంలో బాధితులకు బి. కొండాపూర్ గ్రామానికి చెందిన, నర్సవుల లచ్చయ్య కు 24000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు అయిత పరంజ్యోతి, యువనాయకులు సండ్రుగు శ్రీకాంత్,మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, మండల కాంగ్రెస్ ఎస్ టి సెల్ అధ్యక్షులు ఫకీర్ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, బి కొండాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, మాజీ ఉప్పసర్పంచ్ రమేష్ గుప్త, మహేశ్, తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ రాజ్యం రైతుల పేదల పక్షపాత ప్రభుత్వం...

– మహిళా ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంది..



**పాపన్నపేట,నవంబర్,25, మెదక్ టుడే న్యూస్:** పాపన్నపేట మండలంలోని మంగళవారం పొడిచాన్ పల్లి రైతు వేదికలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుఈసందర్భంగా మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం రైతుల పేదల పక్షపాత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేందుకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు, గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం, ఉచిత కరెంటు, వడ్డీ లేని రుణాలు ,ఇందిరా మహిళా శక్తి చీరలు,తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నదని, వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ వడ్డీ లేని రుణాలతో మహిళల్లో ఒక ధైర్యం, నమ్మకం, ఆత్మ విశ్వాసం ఏర్పడిందని అన్నారు. మహిళలు ఒకేపనికి పరిమితం కాకుండా, అని రంగాల్లో అభివృద్ధి చెందాలని, మహిళల పేరు మీదనే కల్యాణ లక్ష్మి, ఇందిర మహిళా శక్తి చీరల వంటి పథకాలు అందిస్తుందన్నదని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడ్డీ లేని రుణాల రాయితీ కింద 30 కోట్ల 50 లక్షలు చెక్కును అందజేశారు. అనంతరం ప్రత్యేకంగా 11 వేల మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు 8.89 కోట్లు వడ్డీ రాయితీ అందించామన్నారు. మహాలక్ష్మి పథకం కింద 04 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయగా 100 కోట్ల రూపాయలు మహిళలు లబ్ది పొందడం జరిగిందన్నారు. అలాగే గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సౌకర్యం పై 28 కోట్ల 65 లక్షల రూపాయలు లబ్ధిదారుల జీరో అకౌంట్ లో జమ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో పాపన్నపేట ఎంపీడీవో విష్ణువర్ధన్, ఎంపీ ఓ శ్రీశైలం ,ఏపీఎం రాజు, పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద నాయక్, ప్రభాకర్ రెడ్డి, నరేందర్ గౌడ్, శ్రీకాంత్ అప్ప, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చేగుంటలో నేడు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో

– మెగా ఉచిత వైద్య శిబిరం

– దీప్తి స్కూల్ వీధిలో హమాలి సంఘం భవనం దగ్గర




**చేగుంట నవంబర్ 25 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట వారి ఆధ్వర్యంలో సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ వారి సౌజన్యంతో చేగుంట పట్టణంలోని దీప్తి స్కూల్ వీధిలో గల హమాలి సంఘం వద్ద నేడు అనగా (బుధవారం నాడు )ఈ వైద్య శిబిరం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు ఉండును. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులచే అన్ని రకాల ఆరోగ్య సమస్యలు చూస్తారు అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని,వైద్య శిబిరంలో మెడిసిన్స్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. అని ఇట్టి వైద్య శిబిరంను ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని లయన్స్ జోన్ ఛైర్పర్సన్ ఆకుల సుఖేందర్ ,క్లబ్ ప్రెసిడెంట్ శంభుని శ్రీనివాస్ తెలియజేశారు.

# ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య...



**పాపన్నపేట,నవంబర్,25, మెదక్ టుడే న్యూస్:** మనస్తాపంతో ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన మేరకు వివరాలు. గ్రామానికి చెందిన గడ్డమీది ఉమామహేశ్వర్(23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య దీపికతో గత కొన్ని రోజులుగా సంసార విషయంలో చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇంట్లో నుండి మనస్తాపంతో బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు మంగళవారం ఉదయం గ్రామంలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు పేర్కొన్నారు.

# గురువారం సాయిబాబా ఆలయ16వ వార్షికోత్సవం

– ఆలయ పూజారి విశ్వనాథ శర్మ..



**పాపన్నపేట,నవంబర్,25, మెదక్ టుడే న్యూస్:** మండల కేంద్రమైన పాపన్నపేటలో నీ (గురువారం) సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి చెరువుపల్లి విశ్వనాథ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 08.00గం.కు గణపతి పూజ, పాలతో అభిషేకం అనంతరం రమ సమేత సత్యనారాయణ స్వామీ వ్రతం, మధ్యానం హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రామారపు వీరేశం గుప్తా దంపతులచే అన్న ప్రసాదాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# చేగుంట మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాడేం వెంగళరావు



**చేగుంట నవంబర్ 25మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాడేం వెంగళరావు ను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి,తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రేపక తిరుపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సాయి,సీనియర్ నాయకులు విజయ్ పాల్ రెడ్డి,పంది రాజు, తదితరులు ఉన్నారు.

# భీమన్న సన్నిధిలో విప్, ఇన్‌చార్జి కలెక్టర్ పూజలు

వేములవాడ టౌన్, నవంబరు 25 : వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. విప్, ఇన్‌చార్జి కలెక్టర్‌లు కొడె మొక్కులు చెల్లించారు. భీమన్న ఆలయంలో స్వామివారికి నివేదన జరుగుతున్న సందర్భం గా అరగంటసేపు నిరీక్షించారు. అనంతరం భీమన్న స్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ మండ పంలో వారికి వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రమాదేవి శేషవస్త్రం కప్పి ప్రసాదం అందజేశారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. కోడెల క్యూ లైన్, ఉచిత దర్శనం, అభిషేకం క్యూలైన్‌లను పరిశీలించారు.

# నూతన ‘లేబర్ కోడ్’లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దు

– టియుడబ్ల్యుజె రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం






**(స్టేట్ బ్యూరో)నవంబర్,25, మెదక్ టుడే న్యూస్:** కేంద్ర ప్రభుత్వం అమలులోనికి తీసుకొచ్చిన నూతన ‘లేబర్ కోడ్’లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయాలని టియుడబ్ల్యుజె–ఐజెయు, కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించాయి. నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నాలతో పాటు ఇందిరాపార్క్ వద్ద ‘కార్మికుల తలపెట్టనున్న నిరసన గళం’ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యుజె) అధ్యక్షుడు కె.విరాహత్ అలీ అధ్యక్షతన బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్, ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులతో పాటు వైట్ కాలర్ ఉద్యోగులు పరోక్షంగా తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కనీసం కార్మిక సంఘాల నేతలతో చర్చించకుండానే నూతన లేబర్ కోడ్‌లను అమలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. నూతన లేబర్ కోడ్‌లపై ప్రధాన మీడియాలు చర్చలు పెట్టకపోవడం విడ్డూరమని, కార్పొరేట్ శక్తుల చేతుల్లో మీడియా బంది అయిపోయిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో న్యాయవ్యవస్థ కూడా రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోవడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. జాతీయ మీడియాతో పాటు తెలుగు ప్రధాన పత్రికలు సైతం ప్రస్తుతం అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులు, ఉద్యోగులకు కలిగే లాభ, నష్టాలను వివరించకపోవడం బాధకరమని చెప్పారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో వర్కింగ్ జర్నలిస్టు అంటే మెడికల్ రిప్రజెంటివ్ ఉద్యోగంతో సమానంగా చూస్తున్నారని శ్రీనివాస రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 26 మందితో కమిటి వేసి 1955లో మొదటి న్యూస్ పేపర్ యాక్ట్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. దాని ఫలితమే ప్రస్తుత ఆర్ఎన్ఐ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పిసిఐ) ఏర్పాటు, జర్నలిస్టల అపాయింట్‌మెంట్స్, 6 గంటల పని, మహిళ రక్షణ, సెలవులు తదితరవి జర్నలిస్టులకు రక్షణగా నిలుస్తున్నాయని ఆయన వివరించారు. మొదట్లో వేతన సవరణ ప్రతి సంవత్సరం అమలు చేసేవారని, కాలక్రమేణ 3 నుంచి 5 సంవత్సరాలకు పెరిగిందని, ప్రస్తుతం వేతన సవరణ అమలు 15 సంవత్సరాలు దాటినప్పటికీ చేయడం లేదన్నారు. అల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పివి.కృష్ణ రావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చెపట్టినప్పటీ నుంచి బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహించడం, మెర్జ్ పేరుతో బ్యాంకుల విలీనం తదితర లాంటివి బ్యాంకు ఉద్యోగుల శ్రమదోపిడీ చేయడమేనని స్పష్టం చేశారు. కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి ప్రైవేటైజెషన్ పేరుతో బ్యాంకులను విదేశీ సంస్థలకు అప్పగించడంతో పాటు మనీలెండర్స్ చేతుల్లోకి దేశ ప్రజలను నెట్టివేసేలా మోడి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రం అమల్లోకి తెచ్చిన నూతన లేబర్ కోడ్‌లతో ‘కంపెనీలకు లాభం, కార్మికులకు నష్టం’ అని అన్నారు. ఐటి ఎంప్లాయిస్, స్పెషల్ జోన్(ఆధిభట్ల) ప్రాంతాలలో ఉద్యోగులకు యూనియన్లు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నూతన లేబర్ కోడ్‌ల రద్దు కోసం సుప్రీం కోర్టుకు వెళ్లడంతో పాటు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు సైతం నూతన లేబర్ కోడ్‌ల వలన కలిగే నష్టాలను వివరించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలన్ని కలిసి 10 రోజులు నిర్విరామంగా సమ్మె చేస్తే కేంద్రం దిగివస్తుందని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఏండి. యూసుఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడే యూనియన్లను లేకుండా చేయడమే లక్ష్యంగా మోడి ప్రభుత్వం నూతన లేబర్ చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. శ్రామికులను నష్ట పరిచి పరిశ్రమలకు లాభం చేకూర్చేలా మోడి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కార్మికులందరూ ఏకమై తమ నిరసన గళంతో నూతన లేబర్ కోడ్‌లు రద్దు చేసేలా మోడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. టియుసిఐ నాయకుడు సూర్యం మాట్లాడుతూ నూతన లేబర్ చట్టాల ద్వారా గిగ్ వర్కర్లకు మేలు జరుగుతుందని ప్రధాని మోడి చెప్పడం హాస్యాస్పదమన్నారు. కంపెనీలకు వచ్చే లాభాల నుంచి కాకుండా గిగ్ వర్కర్లకు వచ్చే వేతనంలో కొద్ది మొత్తం పన్నుల రూపంలో వసూలు చేసి, వారి ప్రొటెక్షన్ కోసమని గొప్పలు చెప్పుకొవడం విడ్డూరమని దుయ్యబట్టారు. దేశ వ్యాప్తంగా సుమారు 40 కోట్ల మంది కార్మికులు ఉంటే, అందులో కేవలం 7 కోట్ల మందికి మాత్రమే పిఎఫ్, 3 కోట్ల మందికి ఇఎస్ఐ అమలవుతుందని శోచనీయమన్నారు. నూతన లేబర్ కోడ్‌లతో కలిగే నష్టాలను ప్రతి కార్మికుని వద్దకు చేరే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ సత్యమేవ జయతే–శ్రమయేవ జయతే అని మోడి ప్రభుత్వం కార్మికుల శ్రమను దొపిడీ చేస్తుందన్నారు. మహిళ ఉద్యోగులకు పట్టపగలే రక్షణ లేని పరిస్థితులు కనిపిస్తుంటే, రాత్రి సమయాల్లో కూడా మహిళలు ఉద్యోగం చేసుకొవచ్చనే హక్కు కల్పించడం బాధకరమని మండిపడ్డారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు శుష్క ప్రియులు– శూన్య హస్తాలు అనే సామేత చందంగా ఉందని ఎద్దేవా చేశారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరును శాశ్వతంగా రూపుమాపడానికే ఆయన అమలు చేసిన లేబర్ చట్టాలను ప్రస్తుత ప్రధాని మోడి రద్దు చేసి, వాటి స్థానాల్లో నూతన చట్టాలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఎప్పుడు లేని విధంగా ప్రధాని మోడి తన ట్విట్టర్ ఖాతా ద్వారా నూతన లేబర్ కోడ్‌ల గురించి క్లుప్తంగా వివరించడం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి కే.రాములు, రాష్ట్ర కార్యదర్శి వి.యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్, హెచ్.యూ.జె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, కార్యదర్శి బి. వెంకటేశం, ఐ.ఎఫ్.టి.యు నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెచ్చరిల్లుతున్న ఫేక్ న్యూస్

వ్యూస్, డబ్బు కోసం యూట్యూబ్ చానెళ్లు పెడుతున్నవారి సంఖ్య పెరిగిపోతోంది. ఫేక్ న్యూస్, అశ్లీలత కంటెంట్‌తో వీడియోలు రూపొందిస్తున్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. దీనిపై ఎలాంటి నియంత్రణ, కంప్లైంట్ వ్యవస్థ లేకపోవడంతో వీరు చెలరేగిపోతున్నారు. క్రింజ్ వీడియోలు చేసే వారితో ఇంటర్వ్యూలు చేయడమేకాదు, ఆయా వీడియోల్లో అశ్లీలత, సమాజంలోని కొందరిపై విద్వేషం పెంచేలా వీడియోలు రూపొందించడం సర్వసాధారణమైపోయింది. ఫేక్ న్యూస్ ఘటనలు కోకొల్లలు. ఈ మధ్య టాటా బైక్ విడుదలైనట్లు ఫొటోలు వైరల్ అయ్యాయి. అలాగే, ఓ పులి మనిషిని లాక్కుపోతున్న వీడియో కూడా. ఇదంతా ఫేక్ న్యూసే. పైరసీ పోర్టల్‌లో వచ్చే సినిమాలపై ఓ వెబ్ పోర్టల్ అప్డేట్స్ ఇస్తూ దానిని ప్రమోట్ చేస్తున్నది. ‘రూ. 56వేలు తగ్గిన బంగారం ధర!’ వంటి తప్పుడు వార్తల క్లిప్, బైట్ హెడ్‌లైన్స్ పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. ‘మీ దగ్గర పాత నోట్లు ఉంటే రూ.30%–%40 లక్షలు సంపాదించవచ్చు’ అంటూ ఓ వెబ్ పోర్టల్ అదేపనిగా వార్తలను పబ్లిష్ చేసింది. వైరల్ వీడియోలను నమ్ముకుని, అది ఎంతవరకు నిజమనేది రూఢీ చేసుకోకుండానే కొన్ని వెబ్‌పోర్టళ్లు వాటిని ప్రచారం చేస్తున్నాయి. వెబ్ పోర్టళ్లు, యూట్యూబ్ చానెళ్లలో వచ్చే వార్తల్లో నిజమెంత? అని ఫ్యాక్ట్ చెక్ చేసుకునే అవకాశం సాధారణ ప్రజలకు లేదు. ఆ వార్తలు నిజమే అని నమ్మేవారి సంఖ్యే ఎక్కువ. ఫేక్ న్యూస్ వల్ల సమాజంలో గందరగోళం, ద్వేషం, అపనమ్మకం పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ప్రధాన మీడియాపై పడడం ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకర పరిణామం. మీడియా మీద నమ్మకం కోల్పోతే, ప్రజల్లో నిజాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. భారత రాజ్యాంగంలోని 19(1)(%ఋ%) అధికరణ ప్రకారం ‘వ్యక్తి స్వేచ్ఛగా తన అభిప్రాయాన్ని వ్యక్తపరచవచ్చు.’ కానీ తప్పుదారి పట్టించే సమాచారానికి అదే కవచం కాకూడదు. ఐటీ చట్టం 69%ూ%, 79వ సెక్షన్లు ఫేక్ న్యూస్, మిస్ లీడింగ్ కంటెంట్‌పై చర్యలు తీసుకునే అధికారం ఇస్తున్నప్పటికీ వాటి అమలు, ఫిర్యాదు వ్యవస్థలు అందుబాటులో లేవు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న ఈ తరుణంలో ప్రజలను తప్పుదోవ పట్టించే యూట్యూబ్ చానెళ్లు, వెబ్ పోర్టళ్లపై మానిటరింగ్ వ్యవస్థ రావాలి. ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసే వారిపై సులభంగా కంప్లైంట్ చేసేలా ఓ వ్యవస్థను రూపొందించాలి. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి. సమాచారం శక్తిమంతమైనది. కానీ తప్పుడు సమాచారం విధ్వంసం సృష్టిస్తుంది. ప్రజలు నమ్మకంగా ఉండాలంటే, సోషల్ మీడియా బాధ్యతాయుతంగా ఉండాలి. వ్యూస్ కోసం ఫేక్ న్యూస్ ప్రసారం చేసే ఈ డిజిటల్ చానెళ్లను అరికట్టాలంటే ప్రభుత్వం, మీడియా, ప్రజలు ముగ్గురూ కలసి నడవాల్సిందే. నిజాలు తెలుసుకోవడం ప్రజల హక్కు. ఫేక్ న్యూస్ వల్ల వారు ఆ హక్కును కోల్పోకూడదు.

# మదీనా మృతులకు గౌరవ వీడ్కోలు

ప్రమాదవశాత్తు జరిగే దుర్ఘటనల్లో ప్రాణాలు ఎవరు కోల్పోయినా బాధకరమే. ఆ ప్రమాద ఘటన వారి స్వస్థలానికి దూరంగా అందునా విదేశీగడ్డపై సంభవించడం మరింత దుఃఖదాయకం. ఇటీవల హైదరాబాద్ నుంచి ఉమ్రా (ఇస్లామిక్ తీర్థయాత్ర)కు సౌదీ అరేబియాకు వెళ్లిన (చిన్నారులు, మహిళలతో సహా) 45 మంది తీర్థ యాత్రికులు ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ దుర్ఘటన పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీఘ్రగతిన స్పందించిన తీరు అభినందనీయం. ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధతో అధికారిక లాంఛనాలు అన్నీ సత్వరమే పూర్తయి, మృతులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మదీన పుణ్యక్షేత్రంలో అంతిమక్రియలు నిర్వహించారు. ప్రమాదం చోటుచేసుకున్న వెన్వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మృతులకు అయిదు లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు చెందిన వారిని డి.యన్.ఎ పరీక్షల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో సౌదీ అరేబియాకు పంపించారు. రేవంత్ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మోహమ్మద్ అజ్హరొద్దీన్ సారథ్యంలో ఒక అధికారిక బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సౌదీ అరేబియాకు వచ్చింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అత్యున్నత స్థాయి బృందం ఒకటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్వర్యంలో సౌదీ అరేబియాకు వచ్చి సౌదీ అధికారిక వర్గాలతో సమావేశమై మృతదేహాల అప్పగింత విషయమై చర్చించింది. భారతీయ రాయబారితో సహా సమస్త దౌత్యవేత్తలు మదీన పుణ్యక్షేత్రంలో మకాం వేసి మృతదేహాల అప్పగింత, అంతిమక్రియల ఏర్పాట్లను సమన్వయం చేసారు. మదీన పుణ్యక్షేత్రంలోని జన్నతుల్ బఖీ అనే స్మశానవాటికకు ఇస్లాంలో ప్రాముఖ్యత ఉంది. తమను ఈ స్మశానవాటికలో ఖననం చేయాలని విశ్వాసులు ప్రగాఢంగా అభిలషించడం కద్దు. సాధారణంగా ఇక్కడ ఖననానికి అనుమతులు ఇవ్వరు. అయితే భారతీయ అధికారుల కృషి ఫలితంగా హైదరాబాద్ మృతులందరికీ జన్నతుల్ బఖీలో అంతిమక్రియలు నిర్వహించేందుకు సౌదీ అధికారులు అనుమతించారు. ఇదీ ఒక గొప్ప విషయమే, సందేహం లేదు.

# అమెరికాలేని జీ20

జీ20 సదస్సు నిర్వహణ ఎంతో కష్టమని మాతో ఓ మాట ముందే చెప్పవచ్చు కదా... అని భారత ప్రధాని నరేంద్రమోదీతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా అన్నారట. సదస్సు నిర్వహణలో భారత్ సహకారం మరువలేనిదని కూడా ఆయన మోదీతో అన్నారట. రెండేళ్ళక్రితం జీ20 సదస్సును ఘనంగా నిర్వహించిన అనుభవం భారత్‌కు ఉన్నది కనుక, రామ్‌ఫోసా సరదాగా ఈ మాటలు అనివుంటారు. నిజానికి, ఆఫ్రికాఖండంలో జరిగిన ఈ తొలి జీ20 సదస్సు కూడా చక్కగా జరిగింది. దక్షిణాఫ్రికామీద అప్పటికే కక్షకట్టివున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సదస్సుకు రాకపోవచ్చునన్న అంచనాలు ఎప్పటినుంచో ఉన్నవే. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతివారిని నల్లవారు ఊచకోత కోస్తున్నారంటూ ఆర్నెల్లక్రితం శ్వేతసౌధం సమావేశంలో, అంతర్జాతీయ మీడియా సమక్షంలో రామ్‌ఫోసాను ట్రంప్ తీవ్రంగా అవమానించిన ఆ దృశ్యం విస్మరించలేనిది. వందలమంది శ్వేతజాతీయులు హత్యలకు గురైనారంటూ ట్రంప్ మీడియాకు చూపిన ఆ చిత్రాలు సైతం అసత్యాలని అమెరికా పత్రికలే అప్పట్లో విమర్శించాయి. సోషల్ మీడియా ప్రచారాన్ని శ్వేతసౌధం అధికారికం చేస్తున్నదని తప్పుబట్టాయి. ఈ ఆరోపణలను సిరిల్ ఖండిస్తూ, తనది పేదదేశమని, అమెరికా అధ్యక్షుడికి ఖరీదైన విమానాలను బహుమతిగా ఇచ్చుకోలేనంటూ ఓ నర్మగర్భమైన వ్యాఖ్య కూడా చేశారు. ఖతార్ మాదిరిగా బోయింగ్ ఇచ్చి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోగల ఆర్థికస్తోమత తనకు లేదన్న ఆ వ్యాఖ్యలో హాస్యం కంటే అదిమిపట్టిన ఆగ్రహమే అధికం. శ్వేతజాతి పరిరక్షకుడుగా అవతారమెత్తి, దక్షిణాఫ్రికామీద కాలుదూస్తున్న ట్రంప్ ఈ జీ20 సదస్సుకు రాకపోవడం ఒకందుకు మనకూ మంచిదైంది. ట్రంప్‌తో దోస్తీ పూర్తిగా చెడి, ఎడమొఖం పెడమొఖంగా ఉన్న తరుణంలో, ట్రంప్‌కు ఎదురుపడకూడదన్న ఉద్దేశంతో ఇప్పటికే నరేంద్రమోదీ పలు అంతర్జాతీయ సదస్సులను వదులుకున్నారు. ఇలా వరుసబెట్టి ప్రపంచవేదికల మీద కనిపించకుండా పోవడం దేశానికి మంచిదికాదని విపక్షాలు సైతం వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో, ట్రంప్ గైర్హాజరీతో అందివచ్చిన జీ20 అవకాశాన్ని మోదీ సద్వినియోగం చేసుకున్నారు. దేశాధినేతలతో ఆయన చిరునవ్వులు, కరచాలనాలు, హాస్యసంభాషణలు మన మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది.




# బిజినెస్




## వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం ఉందన్న ఆర్బీఐ గవర్నర్



రుణ గ్రహీతలకు త్వరలో శుభవార్త అందే సూచనలు కనిపిస్తున్నాయి. వడ్డీ రేట్లను మరింత తగ్గించేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఓ ప్రముఖ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, రెపో రేటు కోతకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కీలక సంకేతాలిచ్చారు.అక్టోబర్‌లో జరిగిన ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలోనే భవిష్యత్ రేట్ల కోతపై సూచనలు ఇచ్చామని, ఆ తర్వాత వెలువడిన స్థూల ఆర్థిక గణాంకాలు కూడా సానుకూలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా, అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతం వద్ద రికార్డు కనిష్టానికి చేరడం రేట్ల తగ్గింపునకు మార్గం సుగమం చేస్తోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆహార పదార్థాల ధరలు తగ్గడం, వినియోగ వస్తువులపై పన్నుల కోత వంటివి ఇందుకు దోహదపడ్డాయి. 2025 ప్రథమార్ధంలో ఎంపీసీ రెపో రేటును 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి దాన్ని స్థిరంగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న కమిటీ సమావేశంలో రేట్ల కోతపై తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ వెల్లడించారు.ప్రస్తుతం రెపో రేటు 5.5 శాతంగా ఉంది. ఒకవేళ డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే అది 5.25 శాతానికి చేరుతుంది. అదే జరిగితే గృహ, వాహన, ఇతర రుణాలపై ఈఎంఐల భారం గణనీయంగా తగ్గుతుంది. ఆర్బీఐ గవర్నర్ వ్యాఖ్యల నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ పదేళ్ల బాండ్ల రాబడులు నాలుగు పాయింట్లు తగ్గి 6.48 శాతానికి చేరాయి.

## స్పామ్ కాల్స్‌ను బ్లాక్ చేస్తే సరిపోదు



స్పామ్ కాల్స్‌కు సంబంధించి టెలికాం నియంత్రణ సంస్థ కీలక ప్రకటన చేసింది. మొబైల్‌ఫోన్‌కు వచ్చే స్పామ్ కాల్స్, మెసేజ్‌లను బ్లాక్ చేస్తే సరిపోదని, తప్పనిసరిగా డీఎన్‌డీ యాప్ నుంచి రిపోర్ట్ చేసి తీరాలని సోమవారం ప్రకటనలో స్పష్టం చేసింది. సబ్‌స్క్రైబర్లు ఇచ్చిన ఫిర్యాదుల ద్వారా ఇప్పటివరకు సుమారు 21 లక్షల మొబైల్ నంబర్లను నిషేధం విధించాం. ఈ ఫిర్యాదులన్నీ డీఎన్‌డీ యాప్ నుంచే వచ్చాయి. అప్పుడే తాము కూడా చర్యలు తీసుకుంటాం. కేవలం మొబైల్స్‌లో సదరు స్పామ్ కాల్స్, మెసేజ్‌లను బ్లాక్ చేస్తే పరిష్కారం ఉండదు. డీఎన్‌డీ ద్వారా ఫిర్యాదు చేయడంతోనే ఆయా నంబర్లను గుర్తించి శాశ్వతంగా నిషేధించడానికి వీలుంటుందని ట్రాయ్ తెలిపింది. కాబట్టి యూజర్లు డీఎన్‌డీ యాప్ నుంచి స్పామ్ కాల్స్, ఎస్సెమ్మెస్‌ల గురించి ఫిర్యాదు ఇవ్వాలని ట్రాయ్ సబ్‌స్క్రైబర్లను కోరింది. వ్యక్తిగతంగా తమ మొబైల్స్‌లో నంబర్లను బ్లాక్ చేసి ఊరుకోవద్దని అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. యూజర్లు డీఎన్‌డీ యాప్‌లో నంబర్‌ను రిజిస్టర్ చేసుకోవాలని, ఆ తర్వాత కాల్ లాగ్‌లో స్పామ్ కాల్స్, మెసేజ్‌లను ఎంచుకుని 1909కి రిపోర్ట్ చేయాలని తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్‌నాలెడ్జ్‌మెంట్ వస్తుంది.

## ట్రాయ్ కొత్త ఆదేశాలతో జియో నుండి కొత్త ప్లాన్లు

ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం కేవలం వాయిస్ కాలింగ్, ఎస్ఎంఎస్‌లను లక్ష్యంగా చేసుకుని రెండు కొత్త ప్రీపెయిడ్ ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాలకు అనుగుణంగా, తక్కువ ధరకే డేటాతో సంబంధం లేకుండా ఈ ప్లాన్లను అందిస్తోంది. కొత్తగా రూ.458 మరియు రూ.1958 ధరలతో ఈ ప్లాన్లు జియో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. రూ.458 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకున్న వినియోగదారులకు 84 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. దీని కింద దేశంలోని ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. దీంతో పాటు 1000 ఎస్ఎంఎస్‌లు, జియో టీవీ, జియో సినిమా వంటి యాప్‌లకు ఉచిత యాక్సెస్ ఉంటుంది. ఈ ప్లాన్‌లో ఎలాంటి మొబైల్ డేటా లభించదు.అలాగే దీర్ఘకాలిక వ్యాలిడిటీ కోరుకునే వారి కోసం రూ.1958 ప్లాన్ ప్రవేశపెట్టారు. దీని వ్యాలిడిటీ ఏకంగా 365 రోజులు. ఈ ప్లాన్ ద్వారా అపరిమిత వాయిస్ కాలింగ్, 3600 ఎస్ఎంఎస్‌లు, ఉచిత నేషనల్ రోమింగ్ సౌకర్యం, జియో యాప్‌లకు కాంప్లిమెంటరీ సబ్‌స్క్రిప్షన్ కూడా పొందవచ్చు. ఈ కొత్త ప్లాన్లు ప్రవేశ పెట్టిన నేపథ్యంలో జియో తన పాత ప్లాన్ల జాబితా నుంచి రూ.479, రూ.1899 ప్లాన్లను తొలగించింది.



## కొత్త వ్యాపారంలోకి అదానీ గ్రూప్



అదానీ గ్రూప్ కొత్త వ్యాపారంలోకి అడుగు పెట్టనుంది. ఇప్పటికే విమానయాన రంగంలో ఉన్న సంస్థ త్వరలో ఏవియేషన్-శిక్షణ వ్యాపారంలోకి ప్రవేశించనుంది. దీనికోసం అదానీ గ్రూప్ ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్(ఎఫ్ఎస్‌టీసీ)ను కొనుగోలు చేసేందుకు ముందస్తు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. 2012లో ఏర్పాటైన ఎఫ్ఎస్‌టీసీ గురుగ్రామ్, హైదరాబాద్, ముంబైలలో ఉన్న నాలుగు సిమ్యులేటర్ కేంద్రాలతో పాటు హర్యానా, సూరత్, సోలాపూర్‌లలో నాలుగు విమాన శిక్షణ అకాడమీలను నిర్వహిస్తోంది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ (ఏడీఎస్‌టీ), ఫ్లైమ్ ఏరో మధ్య 50:50 జాయింట్ వెంచర్ అయిన హారిజన్ ఏరో సొల్యూషన్స్ ద్వారా ఈ కొనుగోలు ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నారు. ఏడీఎస్‌టీ పూర్తిగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యంలో ఉంది. అయితే ఫ్లైమ్ ఏరోను ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ కుమారుడు ప్రజయ్ పటేల్ ప్రమోట్ చేస్తున్నారు. ఎఫ్ఎస్‌టీసీ కంపెనీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 214.5 కోట్ల ఆదాయాన్ని, రూ. 124.2 కోట్ల నిర్వహణ లాభాలను నమోదు చేసింది.

## కూలుతున్న 'క్రిప్టో'.. భారీగా పతనం

ఇటీవలి కాలంలో ఆకాశాన్ని తాకిన క్రిప్టోకరెన్సీలు ఇప్పుడు కూలిపోతున్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి అనేక ప్రముఖ క్రిప్టోలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. ముఖ్యంగా బిట్ కాయిన్ విలువ కేవలం కొన్ని వారాల్లో 25 శాతం మేర పతనమై పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. నవంబర్ మొదట్లో 1.10 లక్షల అమెరికా డాలర్లకు పైగా ఉన్న బిట్ కాయిన్ ధర ఇప్పుడు 80,553 డాలర్లకు పడిపోయింది. ఇది 2022 జూన్ తర్వాత బిట్ కాయిన్‌కు వచ్చిన అతి పెద్ద పతనంగా మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. కేవలం బిట్ కాయిన్ మాత్రమే కాదు, ఇథీరియం, సొలానా వంటి ఇతర ప్రధాన క్రిప్టోకరెన్సీల విలువలు కూడా గణనీయంగా తగ్గాయి.

## ఆర్బీఐ కొత్తగా రూ. 5000 నోట్లు తీసుకొస్తుందా?



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో కొత్తగా రూ. 5 వేల విలువైన కరెన్సీ నోట్లను జారీ చేస్తుందంటూ.. సోషల్ మీడియాలో విస్తృతంగా పోస్టులు, వార్తలు వైరల్ అవుతున్నాయి. దీంతో చాలా మంది నిజమనే నమ్ముతున్నారు. తెలిసీ తెలియక వాటిని ఇతరులకు షేర్ చేయడం.. సామాజిక మాధ్యమాల్లో రీపోస్ట్ చేయడం వంటివి చేస్తున్నారు. దీంతో జనం దీనిని నిజమని నమ్మేందుకు అవకాశం ఉంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రచారాన్ని అధికారికంగా ఖండించింది. ఈ సమాచారం పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేసింది. భారత ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. సోమవారం సాయంత్రం తన ఎక్స్ అకౌంట్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. 'కొత్త రూ. 5 వేల నోట్లను తీసుకురావాలన్న నిర్ణయమేదీ ఆర్బీఐ తీసుకోలేదు. ఆ ప్రచారంలో ఎలాంటి నిజం లేదు.' అని ఆ పోస్టులో తెలిపింది. ఇటీవలి కాలంలో నకిలీ సమాచారం వ్యాప్తి, ఆన్‌లైన్ మోసాలు విస్తృతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తరచుగా ప్రజల్ని అప్రమత్తం చేస్తూనే ఉంది.

## వినియోగమే భారత వృద్ధికి అతిపెద్ద చోదక శక్తి




కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, ఆదాయ పన్ను కోత, వడ్డీ రేట్ల తగ్గింపు వంటి పరిణామాలు దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధికి దోహదపడతాయని ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ గ్లోబల్ అభిప్రాయపడింది. దీనివల్ల ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడులతో పోలిస్తే వినియోగం కీలక చోదకంగా నిలుస్తుందని సోమవారం ప్రకటనలో ఎస్అండ్‌పీ గ్లోబల్ పేర్కొంది. తగ్గించిన జీఎస్టీ రేట్లు మధ్యతరగతి నుంచి వినియోగానికి మద్దతిస్తాయి. ఈ మార్పులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కాకుండా వచ్చే 2026-27లోనూ వినియోగం పెరిగేందుకు, వృద్ధికి మద్దతిచ్చే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారత వృద్ధి అంచనాలను 2025-26లో 6.5 శాతం, 2026-27కి సంబంధించి 6.7 శాతం వృద్ధి సాధిస్తుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ తెలిపింది. అధిక అమెరికా సుంకాలు, ప్రపంచ వాణిజ్య అనిశ్చితులు ఉన్నప్పటికీ, భారత్‌లో స్థానిక గిరాకీ బలంగా ఉంది. భారతీయ ఉత్పత్తులపై అమెరికా సుంకాలను తగ్గించే సంకేతాలు కనిపిస్తున్నాయని నివేదిక పేర్కొంది.

## గువహాటిలో భారత్ చెత్త బ్యాటింగ్..



గువహాటిలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా బ్యాటర్ల వైఫల్యంపై వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ విమర్శలు గుప్పించాడు. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై టీమిండియా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంపై విమర్శనాస్త్రాలు సంధించాడు. తాను తుది జట్టులో ఉండి ఉంటే.. కథ వేరేలా ఉండేదంటూ.. పరోక్షంగా చెప్పాడు. ఈ మ్యాచ్ ప్రస్తావన తేకుండానే.. తన మనసులోని మాటను అందరికీ అర్థమయ్యేలా ఒక్క పోస్ట్‌తో చెప్పేశాడు. గువహటి వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 489 పరుగులు చేసింది. అనంతరం భారత్.. 201 పరుగులకే ఆలౌట్ అయింది. కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్ (15), ధ్రువ్ జురెల్(0), రిషభ్ పంత్ (7), నితీశ్ కుమార్ రెడ్డి (10), రవీంద్ర జడేజా (6) దారుణంగా విఫలమయ్యారు. దీంతో ఈ మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ తీరుపై కరుణ్ విమర్శలు గుప్పించాడు. 'కొన్ని పరిస్థితులు మనసుకు బాగా తెలిసిన అనుభూతిని కలిగిస్తాయి. అలాంటప్పుడు మైదానంలో మనం లేకపోతే మరింత బాధ కలుగుతుంది' అని కరుణ్ నాయర్ ట్వీట్ చేశాడు. ఈ పోస్టును ఇప్పటికే ఏకంగా 15 లక్షల మంది వీక్షించారు. ఈ క్రమంలోనే పలువురు నెటిజన్లు కరుణ్ నాయర్ ట్రిబుల్ సెంచరీని గుర్తు చేస్తున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలోనే అతడు ట్రిబుల్ సెంచరీ చేసి.. జట్టును గెలిపించాడు. ఇప్పుడు అతడు ఉండి ఉంటే కథ వేరేలా ఉండేదని పేర్కొంటున్నారు. కాగా కరుణ్ నాయర్ ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టాడు. దీంతో 8 ఏళ్లు సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. అయితే ఇంగ్లాండ్ పర్యటనలో నాలుగు మ్యాచ్‌ల్లో ఆడిన కరుణ్ నాయర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 33 ఏళ్ల కరుణ్ నాయర్ ఇంగ్లాండ్‌తో 4 టెస్టుల్లో 25.62 సగటుతో 205 రన్స్ మాత్రమే స్కోరు చేశాడు. దీంతో అతడిని టెస్ట్ జట్టు నుంచి తప్పించారు సెలక్టర్లు. అయితే తనను టెస్ట్ జట్టు నుంచి తప్పించడంపై కరుణ్ నాయర్ విమర్శలు గుప్పించాడు. తాను మరో అవకాశం పొందేందుకు అర్హుడిని అని పేర్కొన్నాడు. కానీ వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌తో పాటు సౌతాఫ్రికాతో సిరీస్‌కు సైతం అతడిని ఎంపిక చేయలేదు.

## భారత వన్డే జట్టు ఎంపికపై అనిల్ కుంబ్లే ఫైర్



భారత సెలక్షన్ కమిటీ తీరును టీమిండియా స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే విమర్శించాడు. నవంబర్ 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరగనున్న వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో సంజూ శాంసన్‌ను ఎంపిక చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులో ముగ్గురు వికెట్ కీపర్లకు చోటిచ్చి.. సంజూను మాత్రం ఎందుకు పక్కనపెట్టారని ప్రశ్నించాడు. టెస్టుల్లో ఆడుతున్నాడనే కారణంతో ధ్రువ్ జురెల్‌ను వన్డేలకు కూడా సెలక్ట్ చేయడం అస్సలు కరెక్ట్ కాదన్నాడు. 'సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసే భారత జట్టులో ఒక పేరు కచ్చితంగా ఉండాలని నేను అనుకున్నా. అతడు మరెవరో కాదు సంజూ శాంసన్. రెండేళ్ల క్రితం ఆడిన చివరి వన్డే మ్యాచ్‌లో అతడు సెంచరీ కొట్టాడు. కానీ ఆ తర్వాత కనుమరుగైపోయాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు కూడా సంజూను ఎంపిక చేయలేదు. అయినప్పటికీ సౌతాఫ్రికాతో సిరీస్‌కు ఎంపిక చేస్తారని భావించా. ఆడిన చివరి మ్యాచ్‌లో శతకం బాదిన ఆటగాడు జట్టులో చోటు కచ్చితంగా అర్హుడే' అని అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు వికెట్ కీపర్ బ్యాటర్లు కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో పాటు రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. సీనియర్ అయిన సంజూను కాదని.. ఇప్పటివరకు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడని జురెల్‌ను సెలక్టర్లు ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారింది. జురెల్ ఇప్పటి వరకు టీమిండియా తరఫున 9 టెస్టులు, 4 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 457, టీ20లలో 12 పరుగులు చేశాడు. మరోవైపు సంజూ శాంసన్ చివరి వన్డే మ్యాచ్ రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికాలో ఆడాడు. ఆ మ్యాచ్‌లో సెంచరీ చేశాడు. అప్పటి నుంచి జట్టులో చోటు కోల్పోయాడు.

## బీసీసీఐ అత్యవసర మీటింగ్



రత క్రికెట్ నియంత్రణ మండలి నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే నవంబర్ 30వ తేదీన బీసీసీఐ పెద్దలు అత్యవసరంగా సమావేశం కాబోతున్నారట. స్వదేశంలో వరుసగా భారత జట్టు, సిరీస్ లు కోల్పోతున్న నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పై వేటు వేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. భారత జట్టు బ్యాటింగ్ లైనప్ మార్చడం, అనవసర ప్రయోగాలు చేయడం, హర్షిత్ రాణా లాంటి ప్లేయర్లకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వడంపై బీసీసీఐకి చాలా ఫిర్యాదులు వెళ్లాయట. దీంతో గౌతమ్ గంభీర్ పై వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నవంబర్ 30వ తేదీన గంభీర్ భవిష్యత్తుపై బీసీసీఐ నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు. అతని చేత రాజీనామా చేయించి, కొత్త కోచ్ ను నియామకం చేసే యోచనలో బీసీసీఐ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ భారత జట్టు హెడ్ కోచ్ పదవికి గౌతమ్ గంభీర్ రాజీనామా చేస్తే, అతని స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్ బాధ్యతలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## భారత్‌దే మహిళల కబడ్డీ ప్రపంచకప్


ప్రపంచ వేదికపై భారత మహిళల కబడ్డీ జట్టు సత్తా చాటింది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ప్రపంచకప్‌ను గెలుచుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ 35-28తో చైనీస్ తైపీని ఓడించింది. ఈ పోరు ఉత్కంఠభరితంగా సాగినా.. బలమైన డిఫెన్స్, దూకుడైన



ఆటతో భారత్ పైచేయి సాధించింది. ముఖ్యంగా ఆఖర్లో ట్యాక్లింగ్‌లో అదరగొట్టి విజయాన్ని సొంతం చేసుకుంది. సంజు దేవి, పుష్పా రాణా, చాంపా ఠాకూర్, భావ్నా ఠాకూర్, సాక్షి శర్మ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. రీతూ నేగి సారథ్యంలోని భారత్.. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా టైటిల్ నిలబెట్టుకోవడం విశేషం. 11 దేశాలు పోటీపడిన ఈ టోర్నీలో గ్రూప్ దశలో థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, జర్మనీ, ఉగాండాపై ఘన విజయాలు అందుకున్న భారత్.. సెమీస్‌లో 33-21తో ఇరాన్‌ను ఓడించింది. ఈ ఏడాది భారత్ సాధించిన రెండో పెద్ద విజయమిది. ఈ మార్చిలో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది.

## స్మృతి పెళ్లి వాయిదా.. పలాష్ సోదరి షాకింగ్ పోస్ట్

పలాష్ ముచ్చల్‌తో స్మృతి మందాన వివాహం ... మందాన తండ్రికి గుండెపోటు వచ్చింది.దీంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ తరుణంలోనే స్మృతి మందాన వివాహం వాయిదా పడింది. ఇక ఇవాళ పలాష్ కూడా అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడని ప్రచారం సాగుతోంది. దీంతో ఈ న్యూస్ కూడా వైరల్‌గా మారింది. ఈ పరిణామాలు జరుగుతున్న



నేపథ్యంలో స్మృతి తండ్రికి ఈ పెళ్లి ఇష్టం లేదని, అందుకే ఇలా అనారోగ్యం డ్రామాలు ఆడుతున్నట్లు కొంత మంది ప్రచా రం చేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో స్మృతి మందానతో వివాహం వాయిదా పడడంపై పలాష్ ముచ్చల్ సోదరి పాలక్ కీలక ప్రకటన చేశారు. ఇలాంటి విపత్కర సమయంలో తమ కుటుంబాల గోప్యతకు గౌరవం ఇవ్వాలని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఆదివారం ఉదయం స్మృతి మందాన తండ్రి శ్రీనివాస్ కు హార్ట్ ఎటాక్ రావడంతో పెళ్లి వాయిదా వేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఇదే నిజమన్నారు. కానీ కొంతమంది రకరకాల వార్తలు వైరల్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. పరిస్థితి కుదుటపడే వరకు ఎలాంటి తప్పుడు సమాచారం వైరల్ చేయకండని కోరారు.

Printed Published and owned by **CHILVERA SHIVAKUMAR** and Printed **JWAALA PRINTERS** H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303-
Gmail.“medaktoday94@gmail.com,Editor: **CHILVERA SHIVAKUMAR**. RNI NO.: **TELTEL/2023/88524**, 9948265095, 9494117870